క్లుప్తంగా

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: విద్యార్థుల ఉపాధి కల్పనకు నాణ్యమైన, నైపుణ్యతలతో కూడిన విద్యను తమ కళాశాల అందిస్తుందని ఆర్‌వీ ఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 9 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

మోకీలు, భుజాల నొప్పులకు సత్వర పరిష్కారం

గుంటూరు రూరల్: ఆర్థోస్కోపీ అనేది అత్యాధునిక శస్త్రచికిత్సా విధానమని, ఇందులో చిన్న కోతలు చేసి, ఆర్థోస్కోప్ అనే ప్రత్యేకమైన కెమెరా సాధనాన్ని ఉపయోగించి మోకీలు, భుజాలు, మణికట్టు వంటి జాయింట్లను పరీక్షించి చికిత్సను అందించటం జరుగుతుందని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ మన్నవ కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మణిపాల్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్న తాను ఇటీవల థాయిలాండ్‌లోని ప్రముఖ బుమ్‌రన్‌గ్రాడ్ ఇంటర్నేషనల్ హాస్పిటల్‌లో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ మెడ్‌బంచాచెరణ్‌చుజిత్ ఆధ్వర్యంలో ఐదు రోజుల ఆర్థోస్కోపీ శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకుని రావటం జరిగిందన్నారు. రోగులకు శస్త్రచికిత్స అనంతరం తక్కువ సమయంలోనే పూర్తిగా కోలుకునే అవకాశం లభిస్తుందన్నారు.

నగరంపాలెం రోడ్డులో పార్కింగ్ నిషేధం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార పార్కింగ్ నిషేధమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ట్రావెలర్స్ బంగ్లా నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు ప్రధాన రహదారి వెంబడి పార్కింగ్ చేసిన వాహనాలను 24 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది సమన్వయంతో తొలగిస్తారని హెచ్చరించారు. నగరంలో ప్రధాన రహదారులపై వాహనాలు రోజుల తరబడి పార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. తొలి విడతగా టీబీ బంగ్లా నుంచి నగరంపాలెం మూడు బొమ్మల వరకు ఇరువైపులా అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలను గురువారానికి తమ సొంత స్థలాల్లో పార్కింగ్ చేసుకోవాలని కోరారు.

నేడు దరఖాస్తుల పరిశీలన

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు గురువారం దరఖాస్తుల పరిశీలన నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాదికి సంబంధించి ఆన్ లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్- మోనిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్)లో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు తూర్పు నియోజకవర్గ పరిధిలో వారికి బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్ పేర్కొన్నారు. బీసీ, కాపు, ఈబీసీ, ఏపీ వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, క్షత్రియ, రెడ్డి కమ్యూనిటీ కార్పొరేషన్లకు సంబంధించి వార్షిక ప్రణాళిక, బ్యాంక్ లింక్డ్ స్కీంల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి, వారి దరఖాస్తులను పరిశీలించడానికి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాసధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, ఒక పాస్ పోర్ట్ ఫొటోతో హాజరు కావాలని కోరారు.

సత్తెనపల్లి కోర్టుకు హాజరైన మాజీ మేయర్ కావటి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు గుంటూరు నగర మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు బుధవారం హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో గతంలో జరిగిన దాడికి నిరసనగా క్రోసూరులో చేసిన ధర్నాపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేసింది. ఆ కేసులో కోర్టుకు ఆయన హాజరు కాగా విచారణ నిమిత్తం కేసును వాయిదా వేసినట్లు పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.

ప్రజాసమస్యలపై అధికారుల నిలదీత



మాట్లాడుతున్న కొత్తమల్లాయపాలెం సర్పంచి లక్ష్మారెడ్డి, కొండేపాడు సర్పంచి రాంబాబు

ప్రత్తిపాడు: ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులు చూపుతున్న అలసత్వ వైఖరిని సభ సాక్షిగా ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచులు ప్రజాసమస్యలపై ఏకరువు పెట్టారు. రాజకీయ కారణాలతో మంజూరైన పింఛన్లను నిలిపివేస్తున్నారని, సబ్ సెంటరు మూతబడుతుందని, వ్యవసాయ పని ముట్లు ఇవ్వడం లేదని.. ఇలా రకరకాల సమస్యలను వినిపించారు.

- కొత్తమల్లాయపాలెంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటరు వారంలో మూడు రోజులే తెరిచి ఉంచుతున్నారని, మిగిలిన మూడు రోజులు మూసి ఉంచుతున్నారని, కనీసం ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలైనా ఉండేలా చూడాలని గ్రామ సర్పంచి కుందూరి లక్ష్మారెడ్డి, వైద్యశాఖ అధికారులను కోరారు.
- గనికపూడిలో వాటర్ ప్లాంట్ గడువు ముగిసినా ప్లాంట్‌ను పంచాయతీ స్వాధీనం చేసుకోవడం లేదని, వాళ్లు నీళ్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఎంపీటీసీ సభ్యుడు సురేష్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జలజీవన్ మిషన్ కింద పనులు చేసినా గ్రామంలో రావాటరే సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు.
- గత టీడీపీ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నేటికీ బిల్లులు రావడం లేదని, వాళ్లకు ఏం సమాధానాలు చెప్పాలని కోయవారిపాలెం ఎంపీటీసీ మధు, హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు.
- వికలాంగుల పింఛన్లను మండలంలో ఏ కారణంతో నిలుపుదల చేస్తున్నారని, ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను మూడు, నాలుగు నెలలుగా మీరు ఎలా నిలిపివేస్తారని, పింఛన్లు నిలిపివేసిన వారంతా నానా ఇబ్బందులు పడుతున్నారని కొండేపాడు సర్పంచి నర్రా రాంబాబు వికలాంగుల సమస్యలను లేవనెత్తారు.
- శనగ, పొగాకు దిగుబడులకు కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతాంగ సమస్యలపై సర్వసభ్య సమావేశం తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపాలని తిమ్మాపురం సర్పంచి కల్లూరి శ్రీనివాసరావు కోరారు. అదేవిధంగా అర్హులైన డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణాలు ఇవ్వకుండా నెలల తరబడి కాలక్షేపం చేస్తున్నారని, అధికారులు కార్యాలయాలు వీడి మండలాలకు వచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు.
- కొత్తమల్లాయపాలెం వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు పూర్తిగా నేలకొరిగే స్థితిలో ఉన్నాయని, మూడేళ్లుగా ఎన్ని సార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని సర్పంచి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగిన ఆయా సమస్యలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ తమ్మా రమాదేవి, ఎంపీడీఓ కె.శివపార్వతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

డీవైఈఓ ఏసురత్నం



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీవైఈఓ ఏసురత్నం, గౌసుల్‌మీరా, ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం పేర్కొన్నారు. బుధవారం చౌత్రాలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఈఎండీపీ ఎగ్జిబిషన్-2025 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీవైఈవో ఏసురత్నం మాట్లాడుతూ విద్యార్థుల చిట్టి బుర్రల్లో గట్టి ఆలోచనలు ఉంటాయని, వాటికి పదును పెడితే బాల శాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల మధ్య ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించాలని అన్నారు. స్థానిక సమస్యలకు పరిష్కారాన్ని చూపే విధంగా వినూత్నమైన ప్రాజెక్టులను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అత్యుత్తమ శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గాను గుంటూరు జిల్లాలో 42 పాఠశాలలు ఎంపిక కాగా, ఆయా పాఠశాలల్లోని గైడ్ టీచర్ల ద్వారా 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల స్థాయిలో ఈఎండీపీ ఎగ్జిబిషన్లను నిర్వహించి, వాటిలో నుంచి 13 ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు వివరించారు. తాజాగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ప్రదర్శనలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి దానికి ప్రత్యామ్నాయంగా తయారుచేసిన నార సంచులు, గుడ్డ సంచులు, పేపర్ కప్పులు, జనపనారతో అల్లిన బుట్టలు, తాగి పడవేసిన వాటర్ గ్లాసులతో తయారు చేసిన అలంకరణ వస్తువులు, వాడి పడేసిన టీ కప్పులు, గాజులతో తయారుచేసిన గృహాలంకరణ వస్తువులు, సోలార్ స్మార్ట్ హెల్మెట్ ద్వారా ప్రమాదాలను నివారించటం, కోడిగుడ్డు పెంకులతో తయారుచేసిన గృహాలంకరణ వస్తువులు, రోడ్ల మధ్యలో డివైడర్ల వద్ద గాలి పంకాలను అమర్చి దాని ద్వారా విద్యుత్ ను ఉత్పత్తి చేసి వీధి దీపాలను వెలిగించటం, దొంగల బారి నుంచి ఇళ్లను రక్షించే లేజర్ లైట్ వ్యవస్థ వంటి ప్రాజెక్టులు బాగా ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈసందర్భంగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కొలకలూరు, ముట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ డీఏ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈవో రాయల సుబ్బారావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆరాధ్య శర్మ, అకడమిక్ కోఆర్డినేటర్ అప్పారావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓలా ఉబర్ సర్వీసులు నిలిపివేత

నెహ్రూనగర్: ఓలా, ఉబర్ సర్వీస్‌లను ఈ నెల 3వ తేదీ నుంచి నిలిపివేయనున్నట్లు గుంటూరు ఓలా, ఉబర్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు తెలియజేశారు. బుధవారం లాడ్జిసెంటర్ వద్ద తమకు జరుగుతున్న అన్యాయాన్ని బ్యానర్‌గా ప్రదర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పదేళ్లుగా గుంటూరు, విజయవాడ నగరాల్లో ఆన్‌లైన్ క్యాబ్స్ నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్ల కష్టాన్ని 30 శాతం కమీషన్ల పేరుతో ఓలా.. ఉబర్ కంపెనీలు దోచుకుని డ్రైవర్లకు మొండి చేయి చూపుతున్నారని ఆరోపించారు. గుంటూరు, విజయవాడ నగరాల్లో సుమారు రెండు వేల మంది క్యాబ్ కింద లింక్ అయి ఉన్నారని చెప్పారు. గుంటూరు, విజయవాడలో సరైన బ్రాంచ్ ఆఫీస్ లేకపోవడంతో డ్రైవర్లకు ఏదైన సమస్య వస్తే ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే సరైన బేరాలు లేక, కారు ఈఎంఐలు చెల్లించలేక, పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు భరించలేక, కుటుంబాలను పోషించుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. బ్రాడ్ కాస్ట్, మల్టీ కాస్ట్ ట్రిప్పులను తీసివేయడంతో పాటు పాత పద్ధతిలో ట్రిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓలా పాస్ తీసివేయాలని, ఓలాలో బేస్ రేటు కిలోమీటర్లు రేట్లతో పాటు టోల్ చార్జీలను పెంచాలన్నారు. గుంటూరు, విజయవాడలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎల్. సంపత్ కుమార్, ఎస్.విల్సన్, కేజీ స్వామి, టి.సుబ్రహ్మణ్యం, ఎస్కే రసూల్, పీ రాజేష్, కే రత్నబాబు, మణిబాబు పాల్గొన్నారు.

అంకిత భావంతో నర్సింగ్ కోర్సు అభ్యసించాలి



ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన కిరణ్మయి, సుజాత

గుంటూరు మెడికల్: నర్సింగ్ కోర్సును ప్రతి ఒక్కరూ అంకిత భావంతో అభ్యసించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ కోరారు. బుధవారం గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో నూతనంగా జీఎన్ఎం కోర్సులో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ వేడుక జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమణ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని చెప్పారు. నర్సింగ్ కోర్సు చదివేందుకు చేరిన విద్యార్థులు నిబద్ధతతో, అంకితభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. నర్సింగ్ వృత్తికి వన్నె తెచ్చిన ఫ్లారెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని చదువుకునే సమయంలో నైపుణ్యం పెంపొందించుకుని సమాజానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సుజాత, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ చిలువూరి కిరణ్మయి పాల్గొన్నారు.



మళ్లీ మురుగు తిప్పలు

నెహ్రూనగర్: మూడు వంతెనల మళ్లీ మురుగు ముంచెత్తింది. రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ కోసం రూ.5కోట్లుకు పైగా వెచ్చించి అదనంగా ఇంకోక టన్నెల్ నిర్మించారు. దీంతో పాటు డ్రైయినేజీ నీరు పోవడానికి పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పకొచ్చారు. ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకుని గత నెల 8వ తేదీన మూడు వంతెనల నుంచి రాకపోకలకు అనుమతించారు. మురుగు సమస్య తీరిపోయినట్లేనని భావించారు. కాని బుధవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి డ్రైయిన్‌లోని మురుగునీరు మూడు వంతెనల రోడ్డు మీదకు వచ్చేసింది. మళ్లీ తిప్పలు తప్పవులే అంటూ ప్రజలు వాపోతున్నారు.

ట్రంప్ విధానాలతో అమెరికాకే నష్టం

లక్ష్మీపురం: ట్రంప్ సుంకాలను ఎదుర్కొవటానికి ప్రపంచ దేశాలన్నీ ఏకమవుతున్న నేపథ్యంలో అగ్ర రాజ్యం పరపతిని పణంగా పెట్టి ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం అమెరికాయే నష్ట పోతుందని అర్థశాస్త్ర అధ్యాపకులు సి.హెచ్ సుబ్బారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో చర్చా గోష్టి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రంప్ ప్రతీకార సుంకాల వలన అమెరికన్ విపణీలో వివిధ వస్తు సేవలు ఖరీదై పోయి అక్కడి సాధారణ జన జీవనం పై ప్రతి కూల ప్రభావం పడుతుందన్న విశ్లేషణలు వెలువడినా ట్రంప్ తనమాట నెగ్గించుకున్నారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, విశ్లేషకులు ముప్పాళ్ళ ప్రసారావు చర్చలో ప్రసంగించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: అరుణాచల పుణ్య క్షేత్రానికి సంబంధించి ఏప్రిల్ 12న పౌర్ణమి పురస్కరించుకుని గిరిప్రదక్షిణ మహోత్సవానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 10 రాత్రి 9 గంటలకు గుంటూరులో బయల్దేరి, 11వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపులు దర్శించుకుని, అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఏప్రిల్ 12 ఉదయం గిరి ప్రదక్షిణ చేసుకుని స్వామి దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాచలంలో ప్రయాణికులను ఎక్కించుకుని 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని చెప్పారు. ఆన్ లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోదలచినవారు 96164 నంబరు ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. టికెట్టు ధర రూ.2,420 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం 7382894613 నంబరులో సంప్రదించాలని కోరారు.

గంజాయి కలిగిన ఉన్న ఇద్దరు అరెస్టు



నెహ్రూనగర్: గంజాయి కలిగి ఉండటంతో పాటు దానిని తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు- 1 టౌన్ స్టేషన్ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. స్టేషన్ సీఐ బి.లత తెలిపిన వివరాలు.. ఐపీడీ కాలనీ సత్యసాయిబాబా ట్రస్ట్ వద్ద సంగడిగుంట ప్రాంతానికి చెందిన షేక్ ఇశ్మాయేల్, షేక్ మస్తాన్‌వలి గంజాయి తాగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని, వీరి నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి మేడికొండూరుకు చెందిన విశాల్ కుమార్ అనే యువకుడు గంజాయి సరఫరా చేస్తున్నాడని.. అతని కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఎండీ కె.షరీఫ్, పి.తిరుమలేశ్వరరావు, సిబ్బంది రామయ్య, బసవేశ్వరరావు, పి శ్రీనివాసరావు, వై.సంధ్య, వీఆర్‌ఓలు షేక్ అలీ, వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి

కార్పొరేషన్ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల

నెహ్రూనగర్: వివిధ అంశాలకు సంబంధించిన టెండర్లకు ఆమోదించినట్లు కార్పొరేషన్ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లకు టెండర్ నిర్వహించి నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన 13 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు మార్చి 27న సీల్డ్ టెండర్, బహిరంగ వేలం చేపట్టగా టెండర్‌దార్లు పాల్గొని టెండర్ దాఖలు చేశారని చెప్పారు. అధిక బిడ్ దాఖలు చేసిన వాటిని స్టాండింగ్ కమిటీలో చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు.

ఆమోదించిన వాటిలో డాక్టర్ కొల్లి శారదా హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌లో రుసుం వసూలు చేసుకునే హక్కు, పీవీకే నాయుడు మార్కెట్ లోపల కూరగాయలు, వెలుపల ఆకుకూరల వర్తకుల నుంచి రుసుం వసూలు చేసుకునే హక్కు, విజ్ఞాన మందిరం రోడ్డులోని మరుగుదొడ్లు, పింక్ టాయ్ లెట్స్, తహసీల్దార్ ఆఫీస్ వద్ద, నాజ్ సెంటర్‌లోని మరుగుదొడ్లను నిర్వహించి రుసుం వసూలు చేసుకునే హక్కు, వెన్ లాక్ మార్కెట్ సెల్లార్‌లో సైకిల్ స్టాండ్ నిర్వహించి రుసుం వసూలు చేసే హక్కు, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్‌లో రుసుం వసూలు చేసుకునే హక్కు, అరండల్ పేట 1వ లైన్‌లోని పచ్చగడ్డి మార్కెట్‌లో రుసుం వసూలు చేసుకునే హక్కు, గాంధీ పార్క్‌లో క్యాంటీన్ నిర్వహణ, పీవీకే నాయుడు మార్కెట్ ఉత్తరం, దక్షిణ ఫెన్సింగ్‌లో సైకిల్ స్టాండ్ నిర్వహించి రుసుం వసూలు చేసుకునే హక్కు, గాంధీ పార్క్‌లో మెయిన్ గేటుకి కుడివైపు పార్కింగ్ నిర్వహించి రుసుం వసూలు చేసుకునే హక్కు, సంద్రీస్ మార్కెట్‌లో దిగుమతి చేయు పండ్లకు రుసుం వసూలు చేసుకునే హక్కు పొందిన టెండర్ దార్ల టెండర్లను ఆమోదించామని పేర్కొన్నారు.

సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రెటరీ పి.శ్రీనివాస్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

టెన్త్ స్పాట్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ గురువారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జోన్-3 పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని కోరుతూ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని బుధవారం ఆర్జేడీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హైమారావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా మూల్యాంకన గదుల్లో కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్జేడీ మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు లేకుండా ఆయా జిల్లాల డీఈఓకు ఆదేశాలు ఇస్తామని, మూల్యాంకన విధుల్లో మినహాయింపు కోరుతూ ఉపాధ్యాయులు తగిన ఆధారాలు చూపి మినహాయింపు పొందాలని సూచించారు. ఆర్జేడీని కలసిన వారిలో ఎన్టీఏ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, కె.సాంబశివరావు, గుంటూరు నగర శాఖ అధ్యక్షులు పి.సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి.లలిత బాబు, జిల్లా నాయకులు ఏవీ కృష్ణారావు ఉన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఉచిత భోజనం



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: రోగులకు ఉచిత భోజనం అందించడం ఎంతో అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ అన్నారు. బుధవారం గోరంట్లలోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల వైద్యశాల(ఐడీ హాస్పిటల్)లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు ఆధ్వర్యంలో, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఓపీ రోగుల కోసం ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ ఏపీలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు భిన్నంగా ప్రప్రథమంగా ఓపీ రోగుల కోసం ఉచిత భోజనాన్ని ప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. గుంటూరు అమ్మ ఆశ్రమ వ్యవస్థాపకులు స్వామి జ్ఞాన ప్రసన్న గిరి బాబా మాట్లాడుతూ 'డొక్కా సీతమ్మ తల్లి నిత్య అన్నదానం' పేరిట ఉచితంగా చేస్తున్న అన్నదాన కార్యక్రమం దీర్ఘకాలం జరగాలని అభిలషించారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ అమ్మ ట్రస్ట్ వారి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. రోగులు ఆహారాన్ని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. వారి అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

భారీ వాహనాలు సమయ పాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ హెచ్చరించారు. నగరంపాలెంలోని ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం లారీ, ట్రాక్టర్ యజమానులు, నిర్వాహకులతో సమావేశమయ్యారు. డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎట్టిపరిస్థితుల్లో భారీ వాహనాలకు నగరంలో అనుమతి లేదన్నారు. రాత్రి 8 నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే భారీ వాహనాలు కదలికలు ఉండాలని చెప్పారు. యజమానులు పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. లేని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సింగయ్య పాల్గొన్నారు.

నాగాచారికి కాళహస్తి కళావాహిని పురస్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం ప్రముఖ రంగస్థల నటులు, హార్మోనిస్టు దివంగత పోతకమూరి కాళహస్తీశ్వరరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కాళహస్తి కళావాహిని అధ్యక్షుడు ఎంపీఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పోతకమూరి తారకబ్రహ్మాచార్యులు, హిందూ కళాశాల తెలుగు విభాగాధిపతి ఆచార్యులు ఎల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రసంగించారు. యెల్లంపల్లి యరజర్ల నాగాచారికి కాళహస్తి కళావాహిని పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్(హైదరాబాద్) ఆధ్వర్యంలో ఎం.అర్జునరావు దర్శకత్వంలో నర్తనశాల పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కీచకుడిగా ఎం.అర్జునరావు, విరాటరాజుగా బి.శ్రీనివాసులు, కంకుభట్టు ఎస్.గాత్రియేలు , వలలుడు ఎం.శ్రీనివాస్, బృహన్నల జి.మధుసూధనరావు, తంత్రిపాలుడు ఎస్.బ్రహ్మాజీరావు, సుధేష్ణదేవి సురభి విజయలక్ష్మి తదితరులు తమ నటన చాతుర్యంతో నాటకాన్ని రక్తి కట్టించారు. పి.వినాయకరాజ్ బృందం సంగీతాన్ని సమకూర్చగా, కళాకారులను సత్కరించారు.